## క్లుప్తంగా

### నూతన కమిటీ ప్రమాణ స్వీకారం



బుచ్చిరాజుపాలెం బంగారమ్మ, దుర్గాలమ్మ ఆలయంలో నూతన కమిటీ సభ్యులు

గోపాలపట్నం: త్రివేణి గ్రామాభ్యుదయ సేవా సంఘం నూతన కమిటీ ప్రమాణస్వీకారం బుచ్చిరాజుపాలెంలోని బంగారమ్మ, దుర్గాలమ్మ ఆలయంలో ఘనంగా నిర్వహించారు. నూతన కమిటీ గౌరవ అధ్యక్షుడు రెడ్డి గురు రామరెడ్డి, అధ్యక్షుడు యలమంచిలి చంద్రరావు, ఉపాధ్యక్షులు మళ్ల కనకరాజు, పురెడ్డి కిషోర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గొందేశి రామ్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి నమ్మి లావణ్య కుమార్, కోశాధికారి దొడ్డి జగదీశ్వరరావు తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. వీరిని సంఘ సభ్యులు అభినందించారు.

### క్లాత్ బ్యాగుల పంపిణీ



క్లాత్ బ్యాగ్‌లను పంపిణీ చేస్తున్న మలేరియా అధికారి రవి

మల్కాపురం: ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి ఎంతో హాని కలుగుతుందని.. ప్రతీ ఒక్కరు క్లాత్ బ్యాగ్‌లు వినియోగించాలని మలేరియా విభాగ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ అన్నారు. కోరమాండల్ సంస్థ సమకూర్చిన క్లాత్ బ్యాగ్‌లను మంగళవారం 60వ వార్డు గుల్లలపాలెంలోని శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం వద్ద పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ మన నగరాన్ని మరింత అందంగా తీర్చిదిద్దుకునే బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ప్లాస్టిక్ వినియోగం వద్దు అని,క్లాత్ బ్యాగ్‌లే ముద్దు అని నినాదాలు చేశారు. కార్యక్రమంలో మలేరియా విభాగ సూపర్‌వైజర్ డి.శ్రీనివాసరావు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రత్యేక అవసరాల విద్యార్థుల సామగ్రి పరిశీలన



ప్రత్యేక అవసరాల విద్యార్థులతో మాట్లాడుతున్న సహిత విద్య కో ఆర్డినేటర్ అమ్మినాయుడు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం జీవీఎంసీ ప్రైమరీ పాఠశాల సమీపంలోని భవిత కేంద్రాన్ని మంగళవారం రాష్ట్ర సహాయ సహిత విద్య కో ఆర్డినేటర్ అమ్మినాయుడు, జిల్లా సహిత విద్యా కో ఆర్డినేటర్ బి.గీత సందర్శించారు. అక్కడ చదువుతున్న ప్రత్యేక అవసరాల (దివ్యాంగులు )విద్యార్థులతో కొంత సేపు ముచ్చటించారు. టి.ఎల్.ఎం .యాక్టివిటీ కార్డులు, ఫిజియోథెరిపీ సామగ్రి నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో త్రినాథరావు,వెంకటరావు, మల్కాపురం జీవీఎంసీ ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### పాత ఫుట్ ఓవర్ బ్రిడ్జి తొలగింపు



సింహాచలం రైల్వే స్టేషన్‌లో పాత బ్రిడ్జ్‌ను క్రేన్‌సాయంతో తొలగిస్తున్న దృశ్యం

గోపాలపట్నం: సింహాచలం రైల్వే స్టేషన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జిను అధికారులు మంగళవారం తొలగించారు. ఈ బ్రిడ్జి నిర్మించి 50 ఏళ్లు కావడంతో శిథిలావస్థకు చేరుకుంది. కొన్నేళ్లుగా దీనిపై రాక పోకలు నిలిపి వేశారు. కొత్తగా నిర్మించిన బ్రిడ్జిని ప్రయాణికులు, స్థానికులు వాడుతున్నారు. ఇది మరింత ప్రమాదకరంగా మారడంతో కట్ చేసి భారీ క్రేన్లతో తొలగించారు.





కంచరపాలెం బీఆర్‌టీఎస్ సబ్ వే రైతుబజారు వద్ద ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



మళ్ల సూరి వీధి రహదారి ఫుట్‌పాత్‌పై విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



ఊర్వశి కూడలిలో ఫుట్‌పాత్‌పై దిమ్మ కట్టేసి ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్



దుర్గానగర్ రహదారిలో ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలోనే చిరుతిండి వ్యాపారం

# రారెత్తిస్తున్న ట్రాన్స్‌ఫార్మర్లు

- బీఆర్‌టీఎస్ ఫుట్‌పాత్‌లపై ఇష్టారాజ్యంగా ఏర్పాటు
- రాకపోకలకు భయపడుతున్న పాదచారులు, వాహనదారులు
- విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంపై మండిపాటు

కంచరపాలెం : విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో పాదచారులు, వాహనదారులు హడలిపోతున్నారు. ప్రజలు రాకపోకలు సాగించే ప్రాంతాలకు దూరంగా, ఎవరికీ అందనంత ఎత్తులో ఏర్పాటు చేయాల్సిన ట్రాన్స్‌ఫార్మర్లను... నిర్లక్ష్యంగా బీఆర్‌టీఎస్ ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. జీవీఎంసీ 54, 55, 56, 57 వార్డుల్లో విస్తరించిన కంచరపాలెం, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్ పరిధిలోని తోటవీధి, వివేకనందనగర్, మళ్లసూరి వీధి, సుభాష్‌నగర్, తుమ్మడపాలెం, కంచరపాలెం రైతుబజారు ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు స్థానికులను భయపిస్తున్నాయి. ఊర్వశి కూడలి నుంచి కంచరపాలెం బీఆర్‌టీఎస్ రహదారికి ఆనుకుని గృహ సముదాయాలకు, నూతన దుకాణాలకు చెందిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు రహదారిపై ప్రమాదభరితంగా ఏర్పాటు చేశారు. అటుగా వెళ్లే వాహనాలు ఆ ట్రాన్స్‌ఫార్మర్లకు తగిలి ప్రమాదాలకు గురవుతున్నా పట్టించుకునే నాథుడే కనిపించడం లేదని స్థానికులు, పాదాచారులు ఆరోపిస్తున్నారు. ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. ప్రభుత్వ స్తంభాలకు స్థానిక దుకాణాల ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినా... అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనకు గురవుతున్నారు.

**నిత్యం బిక్కుబిక్కుమంటూనే...**

గత ఏడాది కంచరపాలెం రైతుబజారు ప్రధాన ద్వారం పక్కన ఫుట్‌పాత్‌పై ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ తీగలు తెగిపడడంతో అందరూ ఉలిక్కిపడ్డారు. అదృష్టవశాత్తూ ఎవరికీ ఏ ప్రమాదమూ జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. అప్పటి నుంచి ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. సమీప దుకాణాల ట్రాన్స్‌ఫార్మర్లను సొంత స్థలంలో ఏర్పాటు చేసుకోని యాజమానులపై విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో... ఇదే అదునుగా భావించిన చిల్లర వర్తకులు బీఆర్‌టీఎస్ రహదారులపైనే ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆనుకొని వ్యాపారాలు సాగిస్తున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే బీఆర్‌టీఎస్ రహదారిలో విద్యుత్ స్తంభాలను ఫుట్‌పాత్‌లకు ఆనుకుని దుకాణాలపై ఏర్పాటు చేయాల్సి వుండగా... స్థానిక ప్రజాప్రతినిధి అండతో బీఆర్‌టీఎస్ సబ్‌వేలో స్తంభాలు ఏర్పాటు చేసి రహదారులను కుదించేశారు. ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేసుకునే చిల్లర వర్తకుల దుకాణాలను తొలగించేందుకు టౌన్ ప్లానింగ్, ట్రాఫిక్ పోలీస్ అధికారులు శ్రద్ధ చూపుతున్నారని... ఏపీఈపీడీసీఎల్ అధికారులు బీఆర్‌టీఎస్ రహదారికి ఆనుకుని ఉన్న ఫుట్‌పాత్‌లపై అడ్డంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నా నిమ్మకు నీరెత్తినట్లు చూస్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఫుట్‌పాత్‌లపై ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు తొలగించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

### నిత్యం భయపడుతున్నాం



బీఆర్‌టీఎస్‌లో పలు దుకాణాలకు చెందిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదభరితంగా ఫుట్‌పాత్‌లపైనే ఏర్పాటు చేసేశారు. అసలే రోడ్లు కుదించుకుపోయాయి. అటుగా వెళ్తే ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళనగా ఉంటుంది. ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు తొలగించాలి.

– డి.దాస్, వాహనదారుడు, జ్ఞానాపురం

### నడవడానికి ఇబ్బందికరం



స్థానిక దుకాణాలకు చెందిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఫుట్‌పాత్‌లపై ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేసేశారు. అయినా టౌన్‌ప్లానింగ్, జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకోలేదు. భారీ వాహనాలు వెళ్లేటప్పుడు వాటికి ట్రాన్స్‌ఫార్మర్లు తగిలే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలి.

– సీహెచ్ ఈశ్వరరావు, ఐటీఐ జంక్షన్, కంచరపాలెం

### గౌరీదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు

మల్కాపురం: శ్రావణ మంగళవారం పురస్కరించుకుని స్థానిక గౌరీదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వమించారు.శ్రావణ మంగళవారం నాడు అమ్మవారి ఆలయంలో బాలికలు పూజలు చేస్తే కోర్కెలు తీరుతాయన్న నమ్మకంతో పలువురు విద్యార్థినులు,బాలికలు వచ్చి అమ్మవారికి పసుపు కుంకుమలతో పూజ లు చేశారు. ఈ సందర్భంగా నార్త్ ఇండియన్ మహిళలు గౌరీదేవి కీర్తనలు ఆలపించారు.మధ్యాహ్నం అన్న ప్రసాదాలు అందించారు.

### ఫ్యూజ్‌బాక్సుల ఏర్పాటు



కారాడవారి వీధి వద్ద ఫ్యూజ్ బాక్స్‌ను అమర్చుతున్న సిబ్బంది

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు పరిధి శ్రీహరిపురం, పాత రామాలయం వీధి, కారాడవారి వీధి తదితర ప్రాంతాల్లోని వీధిలైట్లు వెలిగించేందుకు ఫ్యూజ్‌ల వద్ద రక్షణ బాక్సులు అమర్చారు. గతంలో ఇక్కడ ఫ్యూజ్ బాక్సులు లేకపోవడంతో ఫ్యూజ్‌ల వద్ద ప్రమాదకరంగా ఉండేది. రాత్రి సమయంలో ఎవరైనా పొరపాటున తాకితే ప్రమాదం జరిగే పరిస్థితి ఉండేది. దీనిపై ఈ ప్రాంతవాసులు స్థానిక నాయకుడు పోతబత్తుల శ్రీనుకు తెలియజేయడంతో, ఆయన జీవీఎంసీ విద్యుత్ శాఖాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు ఫ్యూజ్‌లను సరిచేసి, ప్లాస్టిక్ బాక్సులను అమర్చారు.

# వణికిస్తున్న వేదిక

- శిథిలమైన పాఠశాల క్రీడా ప్రాంగణంలోని ప్రదర్శనశాల
- ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు



బీటలు వారిన వేదిక వెనుక భాగం



గోపాలపట్నం హైస్కూల్ మైదానంలో వేదిక ముందు భాగం

గోపాలపట్నం: గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలోని వేదిక ప్రమాదకర పరిస్థితిలో ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వేదిక వెనుక భాగం భారీగా బీటలు వారడంతో ఎప్పుడు ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేదిక వెనుక గెడ్డ ఉండడం వల్ల దిగువ ప్రాంతం అంతా కోరుకుపోతోందని, అందువల్లే బీటలు వస్తున్నాయని చెబుతున్నారు. ఈ దారి గుండా వెళ్లేవారు ఈ బీటల్ని చూసి ఆందోళనకు గురవుతున్నారు. ఈ బీటలు రోజు రోజుకు ఎక్కువవుతున్నాయని చెబుతున్నారు. అధికారులు దీని స్థానంలో కొత్తది నిర్మించాలని, అలా కాని పక్షంలో దీనికి మరమ్మతులైనా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# తల్లి పాలే బిడ్డకు శ్రేష్టం



బెహరా కళాశాలలో గర్భిణులకు సీమంతం చేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ తదితరులు



లక్ష్మీనగర్ ఈ బ్లాక్ అంగన్‌వాడీ కేంద్రంలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న సిబ్బంది

గోపాలపట్నం: తల్లిపాలు చాలా శ్రేష్టమని, బిడ్డకు వ్యాధినిరోధక శక్తి వృద్ధి చెందుతుందని ఐసీడీఎస్ అర్బన్-1 సింహాచలం సెక్టార్ సూపర్‌వైజర్ జ్యోతి తెలిపారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా లక్ష్మీనగర్ ఈ-బ్లాక్ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా తల్లిపాల విశిష్టతను వివరించారు. పుట్టిన బిడ్డకు తప్పనిసరిగా తల్లి పాలు పట్టాలని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సీహెచ్ విజయలక్ష్మి, ఆర్.విజయలక్ష్మి, ఎస్.రాధా కుమారి, ఉమా మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

**బెహరా నర్సింగ్ కళాశాలలో..**

నరవ బెహరా నర్సింగ్ కళాశాలలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. నరవ గ్రామంలో గర్భిణులకు ఘనంగా సీమంతాలు చేశారు. తల్లి పాలు బిడ్డకు ఎంత మేలు చేస్తాయో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు వారికి వివరించారు. తల్లుల్లో అవగాహన పెంచేందుకు కళాశాల సెక్రటరీ బెహరా చైతన్య ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## యువకుడి అనుమానాస్పద మృతి

కొమ్మాది : భీమిలి బీచ్ రోడ్డులో ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎంఎస్‌జీ ఫెబల్స్ ఈవెంట్స్‌లో గోపాలపట్నం ప్రాంతానికి చెందిన రామరాజేష్ (22) పని చేస్తున్నాడు. బీచ్ రోడ్డు తొట్లకొండ ఎదురుగా బేవాచ్ పార్కులో ఈవెంట్ నిర్వహణకు పువ్వుల డెకరేషన్ నిమిత్తం సోమవారం ఇక్కడకు చేరుకున్నాడు. పనికి చేరినప్పుడే నెలకు రూ. 20 వేలు జీతం ఇస్తామంటూ ఈవెంట్స్ ఆర్గనైజర్ ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే సోమవారం రాత్రి జీతం రూ. 20 వేలు కాకుండా రూ.10 వేలు మాత్రమే ఇవ్వడంపై ఆర్గనైజేషన్ సిబ్బందితో రామరాజేష్ వివాదానికి దిగాడు. తెల్లవారుజామున చూసేసరికి డెకరేషన్ క్లాత్‌తో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇదిలా ఉండగా యువకుడి ఆత్మహత్యపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సోమవారం రాత్రి స్నేహితులకు వీడియో కాల్ చేసి చనిపోతానని చెప్పాడని ఇక్కడ ఉన్న సిబ్బంది చెబుతుంటే... మానసిక పరిస్థితి సరిగాలేక ఉరి వేసుకున్నాడని కొందరు అంటున్నారు. ఈవెంట్ నిర్వహణకు సుమారు 10 మంది వస్తారని... అయితే రామరాజేష్ ఈవెంట్ రూమ్‌లో ఉరి వేసుకుంటే మిగతా సిబ్బంది ఏం చేస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఆత్మహత్యా..? లేక వేరేమైనా జరిగిందా అని పోలీసులు నిర్ధారించాల్సి వుంది. మృతుని తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ డి.రమేష్ తెలిపారు.

## రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

తాటిచెట్లపాలెం : విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో మంగళవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. విశాఖపట్నం గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం... మంగళవారం ఉదయం రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మరణించినట్లు గుర్తించారు. మృతుని వయసు సుమారు 50 నుంచి 55 సంవత్సరాలు ఉండొచ్చని తెలిపారు. జీఆర్పీ సీఐ ధనుంజయనాయుడు ఆదేశాలతో ఎస్ఐ వి.బాలాజీరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుని వివరాలు తెలిసిన వారు విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో గల గవర్నమెంట్ రైల్వే పోలీసులకు స్వయంగా గానీ, లేదా 96661 22722, 94406 27547కు తెలియజేయాలని జీఆర్పీ ఎస్ఐ బాలాజీరావు తెలిపారు.

## అప్రమత్తతతో సైబర్ నేరాలకు చెక్

### క్రైం ఏసీపీ శ్యామలరావు



మాట్లాడుతున్న క్రైం ఏసీపీ శ్యామలరావు

పెందుర్తి: ప్రస్తుతం సాంకేతికతను వినియోగించుకుని సైబర్ నేరాలకు పాల్పడుతున్న వ్యక్తులపై ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జోన్-2 క్రైం విభాగం ఏసీపీ శ్యామలరావు అన్నారు. ఆర్ఆర్ వెంకటాపురం సమీపంలోని అళ్వార్‌దాస్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులంతా సైబర్ నేరాలపై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. తెలియని నంబర్ల నుంచి ఫోన్ వచ్చినా.. బ్యాంకు ఖాతా ఇతర వివరాలు అడిగినా తెలియజేయవద్దన్నారు. విద్యార్థి దశలో చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి వినియోగం, రవాణా జీవితాలను నాశనం చేస్తుందన్నారు. సమాజంలో గుర్తింపు కావాలంటే చక్కటి నడవడిక అవసరమని చెప్పారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే అనుకున్న లక్ష్యాలను అలవోకగా చేరుకుంటారని పేర్కొన్నారు. వెస్ట్ జోన్ క్రైం విభాగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, పెందుర్తి క్రైం విభాగం సబ్ ఇన్‌స్పెక్టర్ సూరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు బహుమతుల అందజేత



విద్యార్థిని దివ్యశ్రీకి జ్ఞాపిక అందిస్తున్న కాళీ

మల్కాపురం: పబ్లిక్ రిలేషన్ ఎడ్యుకేషన్ డే నుసెయింట్ ఆన్స్ కళాశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. హెచ్‌పీసీఎల్, ఎన్‌టీపీసీ, స్టీల్‌ప్లాంట్ పరిశ్రమల పీఆర్వోలు పబ్లిక్ రిలేషన్స్ అంశంలో సేవలు అందించిన వారికి జ్ఞాపికలు బహూకరించారు. కార్యక్రమంలో పాల్గొన్న హెచ్‌పీసీఎల్ సీనియర్ మేనేజర్ (పీఆర్) కాళీ మాట్లాడుతూ ఏటా ఆగస్ట్ 6వ తేదీన పబ్లిక్ రిలేషన్ ఎడ్యుకేషన్ డేగా కొన్నేళ్లుగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా పీఆర్ అంశంలో ప్రతిభ కనబరిచిన వారికి జ్ఞాపికలు బహూకరిస్తున్నట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ కేథలిన్‌ను, జాతీయ సేవా పథకం ప్రొగ్రాం అధికారి వై.అనసూయాదేవి, కళాశాలలో డిగ్రీ విద్యార్థిని దివ్యశ్రీలకు జ్ఞాపికలను బహూకరించారు.

## ఫ్లెక్సీలు తొలగించారు

సాక్షి ఎఫెక్ట్..

గోపాలపట్నం: వెంకటాపురంలో టీడీపీ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను మంగళవారం జీవీఎంసీ అధికారులు తొలగించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అధికార పార్టీ నేతలకు కోడ్ వర్తించదా? అన్న శీర్షికతో మంగళవారం సాక్షిలో ప్రచురితమైన వార్తకు గోపాలపట్నం తహసీల్దార్ స్పందించారు. ఫ్లెక్సీలు తొలగించాలని జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులకు సూచించడంతో పలు చోట్లు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించారు.

## తుది దశకు అభివృద్ధి పనులు



దుర్గానగర్‌లో నిర్మించిన డ్రెయిన్



40వ వార్డు ఏకేసీకాలనీలో నిర్మించిన డ్రెయిన్

సింధియా: పలు ప్రాంతాల వాసులకు ముంపు కష్టాలు తీరనున్నాయి. గత ప్రభుత్వంలో చేపట్టిన పనులు ఎట్టకేలకు పూర్తయ్యాయి. జీవీఎంసీ 62వ వార్డు ఎస్సార్‌కాలనీ, దుర్గానగర్, త్రినాథపురంలో రూ.30 లక్షలతో డ్రెయిన్లు, మెట్లు నిర్మించారు. అదే విధంగా జీవీఎంసీ 40వ వార్డు పరిధి ఏకేసీకాలనీలో రూ.40 లక్షలతో డ్రెయిన్ల నిర్మాణ పనులు పూర్తి చేశారు. మిగిలిన పనులు తదిదశకు చేరుకున్నాయి.

## పక్కాగా చెత్త సేకరణ



అధికారులను ఆదేశిస్తున్న కమిషనర్ సంపత్‌కుమార్

డాబాగార్డెన్స్: ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ పక్కాగా జరగాలని జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మంగళవారం జోన్-4 పరిధి 28వ వార్డు రామ్‌నగర్, నెహ్రూనగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నివాసిత ప్రాంతాల్లో ప్రతిరోజూ క్లాప్ వాహనాల ద్వారా చెత్త సేకరించాలని, కాల్వల్లో నిత్యం వ్యర్థాలను తొలగించి, మురుగునీరు సాఫీగా పోయేలా చూడాలని జోనల్ కమిషనర్ ప్రసాదరావును ఆదేశించారు. వాణిజ్య సముదాయాలు, దుకాణదారులు కాల్వల్లో చెత్త వేయకుండా డస్ట్ బిన్లు ఏర్పాటు చేసుకుని జీవీఎంసీ చెత్త తరలించే వాహనానికి నేరుగా అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. రోడ్లు, కాల్వలు, బహిరంగ ప్రదేశాల్లో నివాసితులు వ్యర్థాలు వేయకుండా వారంలో ఒకసారి ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమం నిర్వహించాలని, కాల్వల్లో వ్యర్థాలు పేరుకుపోయినందున దోమలు వృద్ధి చెంది సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ తదితర విష జ్వరాలు, వ్యాధులు వ్యాప్తి చెందుతాయని, అందుకు కాల్వల్లో పూడికలతో పాటు ఫాగింగ్, స్ప్రేయింగ్ చేయించాలన్నారు. నెహ్రూనగర్ దోబీఖానాను ఆనుకుని ఉన్న ప్రధాన కాల్వలో వ్యర్థాలు అధికంగా ఉన్నాయని, వారంలో ఒకరోజు కాల్వలో పూడికలు తొలగించాలని ఏఎంవోహెచ్ డాక్టర్ రాజేష్‌ను కమిషనర్ ఆదేశించారు. నెహ్రూనగర్ ప్రధాన కాల్వను ఆనుకుని ఉన్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి పిల్లర్లకు మరమ్మతులు చేపట్టాలని, కాలువలపై ఉన్న పలకలు పూర్తిగా మూసివేయకుండా చెత్త తీసేందుకు వీలుగా పలకలు అమర్చాలని కార్యనిర్వాహక ఇంజినీరు సంతోషిని ఆదేశించారు. పలు చోట్ల కాలువల గుండా తాగునీటి పైపులను గుర్తించి మంచినీటి పైపుల్లోని నీరు కలుషితం కాకుండా నీటిపైపులు క్రమపద్ధతిలో మార్పు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పర్యటనలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఝాన్సీలక్ష్మి, టీపీవో వినయ్‌ప్రసాద్, సహాయ ఇంజినీర్ జాన్సన్ పాల్గొన్నారు.

## ఉక్కుపై కేంద్రం సానుకూలంగా స్పందించాలి

- ఇంటక్ రాష్ట్ర కార్యదర్శి భోగవిల్లి నాగభూషణం

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ చైర్మన్లు మంత్రి రాజశేఖర్, డి.ఆదినారాయణ, ఇంటక్ రాష్ట్ర కార్యదర్శి భోగవిల్లి నాగభూషణం అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు నిరసగా విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో నిర్వహిస్తున్న రిలే దీక్షల్లో 1272వ రోజు, మంగళవారం వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను సందర్శించిన కేంద్ర మంత్రి కుమారస్వామి సానుకూలంగా వ్యవహరించడంతో, ఆయన వచ్చి వెళ్లిన తరువాత ప్రవేశపెట్టే బడ్జెట్‌లో సానుకూలత ఉంటుందని భావించామన్నారు. అయితే, అందుకు భిన్నంగా ఉండడంతో కార్మికులు, ఉద్యోగులు ఆందోళన చెందారన్నారు. ప్రైవేటీకరణ జరగదనే ప్రకటన కోసం యావత్ ఆంధ్ర ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో భాగస్వామ్య పక్షాలుగా ఉన్న టీడీపీ, జనసేనలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలన్నారు. దీక్ష శిబిరంలో ఇంటక్‌కు చెందిన వివిధ విభాగాల కార్మికులు పాల్గొన్నారు. నాయకులు నీరుకొండ రామచంద్రరావు, బీఎస్ రాజు, జీవీ సుబ్బయ్య, కొవిరి అవతారం, సుబ్బారావు, రవి, దుర్గా ప్రసాద్, ఎంవీఎస్ ప్రసాద్, ప్రభాకర్‌రెడ్డి, వేణువర్మ, గంగవరం గోపి తదితరులు పాల్గొన్నారు.